క్లుప్తంగా

ఈఓపీఆర్డీకి పదోన్నతి

తుగ్గలి: మండల ఈఓఆర్డీగా విధులు నిర్వహిస్తున్న వీర్రాజుకు ఎంపీడీఓగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అనంతపురం జిల్లాకు ఎంపీడీఓగా కేటాయించినట్లు అందులో పేర్కొన్నారు. పదోన్నతి పట్ల వీర్రాజు సంతోషం వ్యక్తం చేశారు.

బడి తెరిచిన రోజే కానుక

తుగ్గలి: వేసవి సెలవులు ముగించుకొని పాఠశాలలు తెరిచే సమయానికి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందించేందుకు అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వేణు గోపాల్ తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీలో పంపిణీకి సిద్ధంగా ఉంచిన విద్యా కానుక కిట్ల నాణ్యతను పరిశీలించారు. పాఠశాలల ప్రారంభంలోగా నాడు-నేడు పనులు పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. 10వ తరగతి రెమిడియల్ తరగతులను పరిశీలించి సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రతి విద్యార్థి పాసయ్యేలా కృషి చేయాలన్నారు. ఎంఈఓ రామవెంకటేశ్వర్లు, ఏఎంఓ శివశంకర్, ఐఈ కోఆర్డినేటర్ విజయ ప్రసాద్ రావు తదితరులు ఉన్నారు.

గడప గడపలో నీరాజనం

ఎమ్మిగనూరుటౌన్/రూరల్: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నరని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం పట్టణంలోని 12వ వార్డులో ఇంచార్జ్ షాబుద్దీన్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘుతో కలిసి, సాయంత్రం కందనాతిలో గ్రామ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. వార్డు పరిధిలో డ్రైన్ల సమస్యలను మహిళలు ఆయన దృష్టికి తీసుకురావడంతో వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను సూచించారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, నాయకులు బుట్టారంగయ్య, వీరేంద్ర, ఎంపీపీ గొల్ల కేశన్న, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: బోడబండ గ్రామం వద్ద సోమవారం రాత్రి రెండు స్కూటర్లు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. కోటేకల్ గ్రామానికి చెందిన నాగరాజు, రాజు, చంద్ర ఎమ్మిగనూరులో పని ముగించుకొని బైక్‌పై గ్రామానికి వెళ్తున్నారు. రంగాపురం గ్రామానికి చెందిన రామకృష్ణ ఎమ్మిగనూరుకు బైక్‌పై వస్తున్నాడు. రెండు బైక్‌లు బోడబండ గ్రామ సమీపంలో ఎదురెదురుగా ఢీకొనటంతో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని పోలీస్ రోడ్ సేఫ్టీ వాహనంలో చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం రామకృష్ణ, రాజు, చంద్రను మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఆటో బోల్తా - ముగ్గురికి గాయాలు

పత్తికొండ రూరల్: బుగ్గతండా సమీపంలో సోమవారం ఆటో బోల్తా పడి ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.పత్తికొండ నుంచి తండావైపు వెళ్తుండగా ఎదురుగా వేగంగా వచ్చిన లారీని తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో బుగ్గతండాకు చెందిన రాముడునాయక్, కుమార్‌నాయక్, మహేష్‌నాయక్ గాయపడ్డారు. వీరిని పత్తికొండ ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

వెల్దుర్తి: బైక్ అదుపుతప్పి కిందపడడంతో చెరుకులపాడు గ్రామానికి చెందిన గుర్రప్ప, ఎల్లస్వామి గాయపడ్డారు. సోమవారం వెల్దుర్తి పట్టణం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను 108 సిబ్బంది తమ వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చిన్నారిపైకి దూసుకెళ్లిన ట్రాక్టర్

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని కోతిరాళ్ల గ్రామానికి చెందిన గణేష్ కుమార్తె ఏడాదిన్నర చిన్నారి అమృతపైకి ట్రాక్టర్ దూసుకెళ్లింది. ఇంటి సమీపంలో నిలిపి ఉంచిన ట్రాక్టర్‌కు తాళంచెవి అలాగే ఉంచారు. గణేష్ కుమారుడు దుర్గ (3) ట్రాక్టర్ ఎక్కి ఆడుకుంటూ తాళంచెవిని తిప్పడంతో ఇంజిన్ స్టార్టయి ముందుకు దూసుకెళ్లింది. అక్కడే ఆడుకుంటున్న చిన్నారికి ట్రాక్టర్ బంపర్ తగిలి పక్కకు పడడంతో త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు ట్రాక్టర్ ఇంజిన్ ఆఫ్ చేసి రక్తగాయాలతో ఉన్న చిన్నారిని చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ/వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని గ్రామ సర్పంచ్ మద్దీశ్వరి పేర్కొన్నారు. సోమవారం కనకవీడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీకాంత రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామారావు చేతుల మీదుగా వలంటీర్లను సేవా అవార్డులతో ఘనంగా సన్మానించారు. అతిథులు మాట్లాడుతూ వలంటీర్ల సేవలను కొనియాడారు. వైస్ ఎంపీపీ నడిపి షేక్ సాహెబ్, ఎంపీటీసీ సుశీలమ్మ, పాల్గొన్నారు.

పత్తికొండ డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి

పత్తికొండ టౌన్: పత్తికొండ పోలీస్ శాఖ సబ్‌డివిజన్ నూతన డీఎస్పీగా శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పని చేస్తున్న ఆయన్ను పత్తికొండకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అందరి సహకారంతో శాంతి భద్రతల కోసం కృషి చేస్తానని డీఎస్పీ తెలిపారు.

అభివృద్ధి ప్రదాత.. సంక్షేమ స్ఫూర్తిదాత

- వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో జనం మేలుకే పెద్దపీట
- అవినీతి, పక్షపాతానికి తావులేకుండా అర్హులందరికీ పథకాలు
- అన్ని రంగాల్లో అభివృద్ధి పరుగులు
- వ్యవసాయానికి ఊతం.. చేనేతకు ఆధారం

జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలన జనామోదయోగ్యమైంది. ఇచ్చిన హామీలు-ఎన్నికల మేనిఫెస్టోను భగవద్గీతగా భావించి జన సంక్షేమ క్యాలెండర్‌ను రూపొందించడం దేశ చరిత్రలో నూతన అధ్యాయం. కరోనా కష్టాలు వెన్నాడినా.. గత పాలకుల పాపాలు అడ్డంకులుగా ఉన్నా.. విభజనాంధ్రను లోటు బడ్జెట్ వెక్కిరిస్తున్నా.. వ్యవస్థలను మేనేజ్ చేసే కుటిల రాజకీయ కుట్రలను సైతం చిరునవ్వుతో స్వీకరిస్తూ అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా పాలనను కొనసాగించడం జననేతకే సాధ్యమేమో అన్నట్లు ముందడుగు వేస్తూ నాలుగేళ్ల దాటడం హర్షణీయం.

వ్యవసాయంకు పెద్దపీట వేస్తూ..పేదలకు 'పట్టా'ం కడుతూ.. విద్యారంగంలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టి.. మెరుగైన వైద్య సేవలకు బాటలు వేస్తూ నిత్యం పేదల పక్షాన నిలవడం, వారి గురించే ఆలోచించడం జననేత పాలనలో కీలకమయ్యాయి. చేనేతకు చేయూతనిస్తూ.. జీవనోపాధి మార్గాలను పెంపొందిస్తూ ప్రతి ఇంటా సంక్షేమ గంట మోగిస్తూ.. అభివృద్ధి అజెండాతో ముందుకు పోతున్న జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన మరో పాతికేళ్లైనా కొనసాగాలని కోరుకునే జనం ఆశలు.. ఆకాంక్షలు మరింత ప్రబలమయ్యాయి.



నెరవేరిన కల.. పూర్తయిన నాగలదిన్నె బ్రిడ్జి నిర్మాణం



మార్గం సుగమం.. మిలటరీ కాలనీకి వేసిన రోడ్డు



వైద్యానికి ప్రాధాన్యం.. నిర్మాణంలో ఉన్న పెద్దాసుపత్రి నూతన భవనం

ఎమ్మిగనూరు: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటినుంచే వ్యవసాయ రంగానికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేశారు. నియోజకవర్గంలో రైతు భరోసా కింద 15,325 మంది రైతులకు యేటేటా ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ఆర్బీకేల నిర్మాణంతో ప్రతి రైతుకు గ్రామస్థాయిలో సబ్సిడీ విత్తనాలు మొదలు ఎరువులు, సస్యరక్షణ సలహాలు, పంట దిగుబడుల కొనుగోళ్లు చేపడుతున్నారు.

చేనేతకు చేయూత

చేనేతల కోసం ప్రత్యేకంగా రూ.200 కోట్లు కేటాయించారు. నేతన్న నేస్తం ద్వారా ఏటా రూ.24 వేలు వారి ఖాతాల్లో జమచేస్తున్నారు. అలాగే చేనేత కార్మికులు 50 యేళ్లకే పింఛన్ అందుకుంటున్నారు. 1449 మందికి ప్రతినెలా రూ.39.84 లక్షలు పింఛన్ల రూపంలో ప్రభుత్వం అందిస్తోంది. చేనేత క్లస్టర్ల ద్వారా ముడిసరుకులు, అధునాతన యంత్ర సామగ్రి అందిస్తున్నారు.

పేదలకు 'పట్టా'భిషేకం

ప్రతివాడి సొంతింటి కల సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇళ్ల పట్టాల పంపిణీని పండుగలా చేపట్టారు. నియోజకవర్గంలో 8,521 మందికి ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. కోర్టు కేసులతో మరో 2500 పట్టాల పంపిణీ నిలిచిపోయింది. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాల్లో 7,382 ఇళ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. ఎమ్మిగనూరులో 2300 మందికి టిడ్కో ఇళ్ల హక్కు పత్రాలు పంపిణీ చేశారు.

ఉద్యోగాల విప్లవం

జగనన్న పాలనలో యువతకు ఉపాధి-ఉద్యోగ అవకాశాలు మెరుగుపడ్డాయి. నియోజక వర్గంలో 91 సచివాలయాలు ఏర్పాటు చేసి 753 మందికి ఉద్యోగాలు కల్పించారు. అలాగే 1325 మంది వలంటీర్లను నియమించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ నుంచి శిక్షణ ఇచ్చి 2500 మందికి ప్రవేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందేలా చేశారు.పలువిభాగాల ఉద్యోగులకు వేతనంపెంచారు.

అభివృద్ధి పనులకు ఆయువు

నాలుగేళ్ల పాలనలో సంక్షేమ ఫలాలతోపాటు అభివృద్ధి పనులకు ఆయువు పోశారు. రూ.12.60 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రిని ఆధునికీకరణ, పట్టణంలో నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు. మున్సిపాలిటీ పరిధిలో డ్రైన్లు, రోడ్లు , గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా చేసేలా ఏఐఐబీ పథకం ద్వారా రూ.144 కోట్లతో నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

- నియోజకవర్గానికి ఒక స్కిల్‌హబ్ ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ, రూ.430కోట్లతో తుంగభద్ర దిగువ కాలువ ఆధునికీకరణ, రూ.57.37 కోట్లతో గాజులదిన్నె ప్రాజెక్టు బండ్(ఆనకట్ట)ను ఒక మీటరు ఎత్తు పెంచి ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం పెంచడం, రూ.206 కోట్లతో 176 పాఠశాలల ఆధునికీకరణ చేపట్టారు. 62 సచివాలయాలు, 54 ఆర్బీకేలు, 50 హెల్త్ క్లీనిక్‌లు, 25 పాలశీతలీకరణ కేంద్రాల నిర్మాణాలు జరుగుతున్నాయి. నియోజకవర్గంలో రూ.25 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం, రూ.42 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు జరిగాయి.

జగనన్న ఇచ్చిన వరం



మాలాంటి నిరుపేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన వరంతో సొంతింటి కల నెరవేరింది. ఉండటానికే దిక్కులేని మాకు బళ్లారి-రాయచూరు హైవే రోడ్డు పక్కనే జగనన్న కాలనీ ఏర్పాటుచేసి ఇళ్లు నిర్మించడం మా అదృష్టం. సొంతింటి కల తీరింది. గృహ ప్రవేశం చేసి ఆనందంగా జీవిస్తున్నాం.

– ఏ జయమ్మ, బోడబండ, ఎమ్మిగనూరు మండలం

నాలుగేళ్లలో రూ.96 వేల సాయం



మగ్గం బతుకులు జీవించడం కష్టమైన సమయంలో ముఖ్యమంత్రి జగనన్న చేనేతలకు దేవుడయ్యాడు. నేతన్న నేస్తం ద్వారా ఏటా రూ.24వేలు చొప్పున నాలుగేళ్లలో రూ.96 వేల సాయం అందింది. కరోనా కాలంలో జగనన్న సాయం లేకుంటే మా బతుకులు దుర్భరమయ్యేవి. ఇప్పుడు మేము చేనేత కార్మికులం అని గర్వంగా చెప్పుకొనే పరిస్థితిని జగనన్న కల్పించారు.

– టి.లక్ష్మి, నాగలదిన్నె


రూ.1,13 లక్షల పంట బీమా వచ్చింది



2021–22 ఖరీఫ్‌లో 5.96 ఎకరాల్లో మిరప పంట సాగుచేశా. వర్షాభావంతో పంట ఎండిపోయింది. మిరప తెల్లబారిపోయింది. పంట నష్టం జరిగి డీలా పడ్డాం. అయితే ముఖ్యమంత్రి దయతో రూ.1,13,759 బీమా సొమ్ము ఖాతాలో జమయ్యింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ఇంత మొత్తంలో డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కావడం ఎన్నడూ చూడలేదు.

– చంద్రారెడ్డి, జొహరాపురం

అభివృద్ధికి అర్థం చెప్పిన ప్రభుత్వం



కటారుకొండ వద్ద వేసిన భారీ పైపులైను

- వైఎస్సార్‌సీపీ హయాంలో పత్తికొండ సమగ్రాభివృద్ధి
- చెరువులకు హంద్రీనీవా నీటి మళ్లింపు పనులు
- దశాబ్దాలుగా కలగా మిగిలిన పత్తికొండ రోడ్ల విస్తరణ పనులు ప్రారంభం

పత్తికొండటౌన్: వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనుకబడిన పత్తికొండ నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయించారు.

- హంద్రీనీవా సుజల స్రవంతి ప్రధాన కాలువ నుంచి జిల్లాలోని పత్తికొండ, డోన్, ఆలూరు, పాణ్యం నియోజకవర్గాల పరిధిలోని 68 చెరువులకు నీరు మళ్లించడంతో పాటు, 57 గ్రామాల ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.224.31 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులు టీడీపీ హయాంలో కేవలం 15 శాతం పనులు మాత్రమే జరగ్గా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దాదాపుగా 80 శాతం పైప్‌లైన్ పనులు పూర్తి చేసి రెండు సార్లు ట్రయల్‌రన్ ద్వారా చెరువులకు నీరు మళ్లించారు. అలాగే నియోజకవర్గంలో 35 చెరువులకు నీరు మళ్లించనున్నారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయి. మరో రెండు నెలల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. చెరువులకు నీరు వదిలితే నియోజకవర్గ రూపురేఖలు మారనున్నాయి.

పత్తికొండలో చేపట్టిన అభివృద్ధి పనులు

- పత్తికొండ కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చరిత్రాత్మకం. నియోజకవర్గంలోని 4మండలాలు, ఆలూరు నియోజకవర్గంలోని 5 మండలాలు మొత్తం 9 మండలాలతో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు.
- 12 పోలీస్‌స్టేషన్ల పరిధితో పత్తికొండ కేంద్రంగా పోలీసు సబ్‌డివిజన్ ఏర్పాటు
- పట్టణ ప్రధాన రోడ్ల విస్తరణకు రూ.30కోట్లు నిధులు మంజూరు, పాతబస్టాండు అంబేద్కర్ సర్కిల్ నుంచి ఊరివాకిలి వరకు రోడ్డు విస్తరణ
- వార్డులలో రూ.3కోట్లతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- దశాబ్దాలుగా కలగా మిగిలిన హోసూరు-మొలగవల్లి రోడ్డు నిర్మాణ పనులు రూ.7.50కోట్లతో ప్రారంభం . ప్రస్తుతం బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోంది.
- దూదేకొండ- కొత్తపల్లి గ్రామాల మధ్య రూ.5.5 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం
- మండలంలోని రాజులమందగిరి, అటికెలగుండు, కోతిరాళ్ల, పులికొండ గ్రామాలకు బీటీ రోడ్లు
- నియోజకవర్గంలో 7,953 పక్కా గృహాలు మంజూరుకాగా 1,075 పూర్తయ్యాయి. 5,772 వివిధ దశల్లో ఉన్నాయి.మొత్తం రూ.41.10 కోట్లు ఖర్చు చేశారు.
- వెల్దుర్తిలో ఉన్న 10 పడకల ప్రభుత్వాసుపత్రి స్థాయిని 30 పడకలకు పెంచుతూ నాబార్డు నిధులు రూ.5.77కోట్లతో నూతన భవనం నిర్మించారు.
- వెల్దుర్తి నుంచి రామళ్లకోటకు రూ.10కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం .
- వెల్దుర్తికి రూ.3.50 కోట్లతో క్రిష్ణగిరి రిజర్వాయర్ నుంచి పైపులైన్ వేసి నీటి సమస్య పరిష్కారం
- మన బడి నాడు-నేడు మొదటి విడత కింద నియోజకవర్గంలో 99 పాఠశాలల్లో 721 పనులకుగాను రూ.26.65కోట్లు ఖర్చు చేసి మౌలిక వసతులు కల్పించారు.
- రెండవ విడతలో 135 పాఠశాలల్లో 254 పనులు చేపట్టేందుకు రూ.67.09 కోట్లు మంజూరు.
- గ్రామీణ నీటిసరఫరా శాఖ ద్వారా 210 గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు రూ.87.31 కోట్లు మంజూరు, పలు గ్రామాల్లో పనులు పూర్తి.
- పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో రూ.7.09 కోట్లతో నియోజకవర్గంలోని పలు గ్రామాల బీటీ రోడ్ల మరమ్మతులు పూర్తి.
- చుంచుఎర్రగుడి సమీపంలో ప్రధాన రహదారిపై వంకలో రూ.50 లక్షలతో బ్రిడ్జి నిర్మాణం.
- కంబాలపాడు సమీపాన గత ప్రభుత్వంలో 18 గ్రామాలకు శుద్ధజలం అందించేందుకు మదర్ ప్లాంటు ఏర్పాటు పనులను గత ప్రభుత్వం పూర్తి చేయకపోవడంతో ఈ పనులను ప్రస్తుతం పూర్తిచేసి ట్రాక్టర్ల ద్వారా శుద్ధ జలం పంపిణీ చేస్తున్నారు.
- ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామ పంచాయతీలో రూ.2.5 కోట్లతో డ్రైనేజీ పనులు చేపట్టారు.
- కృష్ణగిరి రిజర్వాయర్ నుంచి వెల్దుర్తి ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.3.10 కోట్లతో పనులు పూర్తి చేసి నీటి సరఫరా చేస్తున్నారు.
- మద్దికెర మండలం మదనంతపురం చెరువు, తుగ్గలి మండలంలోని 13 చెరువులు, కుంటల బలోపేతానికి రూ.36.39 కోట్లు నిధులు విడుదల అయ్యాయి.



ఆలంకొండ-లక్కసాగరం వద్ద ఎత్తిపోతల పథకం ద్వారా 68 చెరువులకు నీళ్లు మళ్లించే పంప్‌హౌస్



ట్రయల్ రన్ ద్వారా బొందిమడుగుల చెరువుకు నీళ్లు వదులుతున్న దృశ్యం

సంక్షేమ పాలనకు నాలుగేళ్లు

- రూ.53 కోట్లతో నగరడోణ రిజర్వాయర్ పనులు
- గ్రామగ్రామానా అభివృద్ధి, ఊళ్లుగా వెలిసిన జగనన్న కాలనీలు
- రూ.15 కోట్లతో 93 సచివాలయాల నిర్మాణం



ఎల్లార్తికి బీటీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం



నగరదోణ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లైనింగ్ పనులు

ఆలూరు: ప్రజలు కోరుకున్న ప్రభుత్వం ఏర్పడి నేటికి నాలుగేళ్లు పూర్తయ్యింది. ఈ నాలుగేళ్లలో పట్టణాలు మొదలుకుని పల్లెలు వరకు కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి సంక్షేమం బాట పట్టించారు. సొంతిల్లు లేని వారికి ఇంటి పట్టాలు పంపిణీ చేసి జగనన్న కాలనీలను ఊళ్లుగా తీర్చిదిద్దారు. ప్రతి గ్రామ పంచాయతీలో సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రాల ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. గర్భిణులు, బాలింతల కోసం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, 108, 104, పశువైద్య సంచార వాహనం సేవలు, రైతుల కోసం వైఎస్సార్ అగ్రిటెక్ పరీక్ష కేంద్రం, ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందించేందుకు సచివాలయ, వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. నిరుపేద పిల్లలు తలరాతలు మార్చేలా నాడు-నేడు కింద నియోజకవర్గంలో 48 జెడ్పీ హైస్కూళ్లతో పాటు ఎంపీపీ, యుపీపీ స్కూళ్లను అభివృద్ధి చేశారు.

ఫ్యాక్షన్ గ్రామాల్లో జలధార

దేవనకొండ మండలం లోగత 50 ఏళ్ల నుంచి ప్రతి గ్రామంలో ఫ్యాక్షన్ కక్షలు, వర్గ విభేదాలతో ఎంతో మంది బలయ్యారు. ఈ గడ్డపై అభివృద్ధికి మార్గం జలధారతో సాధ్యమవుతుందని వైఎస్సార్ ప్రభుత్వం భావించింది. ఫ్యాక్షన్ గడ్డపై హెచ్‌ఎన్ఎస్ఎస్ కింద పత్తికొండ మండలం పందికోన రిజర్వాయర్ నుంచి దేవనకొండ మండలంలో 25 గ్రామాల్లో 45 వేల ఎకరాలకు సాగు నీటిని అందించారు.ఆ బంజరు భూముల్లో నేడు రైతులు మంచి పంటలు దిగుబడి సాధిస్తూ ఫ్యాక్షన్‌కు దూరమయ్యారు.

ప్రజా పాలనకు సచివాలయాలు నాంది

నియోజకవర్గంలోని 6 మండలాలలో 93 సచివాలయాలు,75 ఆర్బీకేలు, 56 హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఇందులో 35సచివాలయాలు, 20 ఆర్బీకేలు పూర్తయ్యాయి. జగనన్న కాలనీలో 80 లేఔట్లలో 5,890 గృహాలు మంజూరయ్యాయి. వీటిలో 2 వేలకు పైగా నిర్మాణం పూర్తయ్యాయి. వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి 25 లింకు రోడ్లు 7.5 కోట్లతో నిర్మించారు. రైతు పంట ఉత్పత్తులను నిలువ చేసుకోవడానికి 5 వందల మెట్రిక్ టన్నుల గోదాములు 30 మంజూరయ్యాయి. ఈ పనులు కొనసాగుతున్నాయి. అలాగే ఆలూరు మండలంలోని మొలగవల్లి గ్రామంలో నాడు-నేడు కింద రూ.1.80 కోట్లతో నూతన పీహెచ్‌సీ భవనం పూర్తి చేశారు. ఆలూరు పట్టణంలో సీహెచ్‌సీ ఆవరణంలో 1.77 నాబార్డ్ నిధులతో ఆధునీకణ చేశారు. భూ గర్భజలాలు పెంచేందుకు రూ.6 కోట్లతో హాలహర్వి మండలం బాపురం, గూళ్యం, మాచనూరు గ్రామాల్లో పనులు చేపడుతున్నారు.

ఆరోగ్య శ్రీ పునర్జన్మనిచ్చింది



నేను ఓ ప్రైవేటు సంస్థలో రూ.6 వేల జీతానికి పని చేసేవాడిని. ఛాతీలో నొప్పి రావడంతో కర్నూలు మై క్యూర్ ఆస్పత్రిలో చేరాను. ఆపరేషన్ చేసి గుండెకు స్టంట్ అమర్చాలని డాక్టర్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉండడంతో రూ.1.65 లక్షల ఖర్చయ్యే ఆపరేషన్‌ను ఉచితంగా చేయడంతో పాటు మందులు అందించారు. కుటుంబ పోషణ భారమై, అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి మానసికంగా మరింత క్షీణించిన నాకు ఆరోగ్య శ్రీ పథకం పునర్జన్మనిచ్చింది. మూడు రోజుల క్రితం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాను. – బసవరాజు, మెదేహాల్, హాలహర్వి మండలం

ఇది రైతు ప్రభుత్వం



వైఎస్సార్‌సిపి ప్రభుత్వం రైతులను తలెత్తుకునేలా చేసింది. సంక్షేమ పథకాలు అందిస్తూ.. వ్యవసాయాన్ని పండుగ చేసింది. నాకున్న రెండెకరాల పొలంతో పాటు మరో నాలుగెకరాల పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం నా ఖాతాలోకి జమచేస్తోంది. దీనికి తోడు పంట నష్ట పరిహారం, రాయితీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఆర్బీకేల ద్వారా అందజేస్తోంది. రైతుల కష్టాలను తీరుస్తూ ఇది రైతు ప్రభుత్వమని సీఎం రుజువు చేసుకున్నారు.

– తిక్కన్న, రైతు, మొలగవల్లి గ్రామం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు రూరల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్రంలో పేదలకు, పెత్తందార్లకు మధ్య జరుగుతున్న యుద్ధంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయం సాధిస్తారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. సోమవారం ఆలూరు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్‌గా చిప్పగిరి మండలానికి చెందిన గుమ్మనూరు నారాయణ, వైస్ చైర్మన్‌గా చిన్న ఈరన్న ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి మంత్రి గుమ్మనూరు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. సంక్షేమం అభివృద్ధి సీఎంకు రెండు కళ్లలాంటివని, ఏన్నో ఏళ్లుగా జరగని అభివృద్ధిని నాలుగేళ్లలో చేసి చూపిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మొత్తం 175 సీట్లు కైవసం చేసుకుని టీడీపీని చిత్తుగా ఓడించడం ఖాయం అని తేల్చిచెప్పారు.

టీడీపీ మేనిఫెస్టో చెత్తబుట్టలాంటిది

మహానాడులో టీడీపీ ప్రకటించిన మేనిఫెస్టో చెత్తబుట్టతో సమానం..మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఓ జిత్తుల మారి నక్క అని మంత్రి గుమ్మనూరు జయరాం ఎద్దేవా చేశారు. 2014లో వేల హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చకపోవడంతో ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఇప్పుడు కొత్తగా ప్రవేశపెట్టిన హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, పార్టీ సీనియర్ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సొసైటీ చైర్మన్లు, మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

చిప్పగిరి మండలం బెల్డోణ గ్రామ సర్పంచ్ సావిత్రమ్మ, భర్త గోవిందుతో పాటు 15 కుంటుంబాలకు చెందిన 60 మంది టీడీపీ కార్యకర్తలు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నట్లు వారు తెలిపారు. కష్టపడి పనిచేసి పార్టీ విజయానికి తన వంతు కృషి చేస్తామని చెప్పారు.

నాలుగేళ్ల పాలనతో నవశకానికి నాంది



హోసూరులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలన నవశకానికి నాంది అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని హోసూరు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ లబ్ధిదారులకు కరపత్రాలను అందజేశారు. సీసీ రోడ్డు, డ్రైనేజీ లేక అవస్థలు పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంపీపీ నారాయణదాస్, సర్పంచ్ నాగప్ప, మండల కన్వీనర్ కారంనాగరాజు, ఎంపీటీసీలు కేశప్ప, నెట్టేకల్, శాంతిరెడ్డి, నాగిరెడ్డి, ఎంపీడీఓ పార్థసారధి, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లపై అనుచిత వ్యాఖ్యలు తగదు



చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా ఎమ్మిగనూరులో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న ఎర్రకోట జగన్ తదితరులు

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమరావతితో పాటు రాష్ట్రవ్యాప్తంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా ఇళ్లను నిర్మిస్తుంటే ఓర్వలేక ఆ స్థలాలు శవాలను పూడ్చేందుకు కూడా సరిపోవని ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు బడుగు బలహీన వర్గాలను కించపరిచే విధంగా మాట్లాడటం శోచనీయమని వైఎస్సార్‌సీపీ నియోజవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. చంద్రబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి పట్టణంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్, షరాఫ్ బజార్, సోమేశ్వర, శ్రీనివాస టాకీస్, అన్నమయ్య సర్కిల్, శివసర్కిల్ మీదుగా సోమప్ప సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తన హయాంలో బడుగుల కోసం ఒక్క అడుగు భూమి కూడా పేదలకు ఇవ్వకుండా ఇప్పుడు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ఎంపీపీ కేశన్న, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైఎస్సార్‌సీపీ నాయకులు రియాజ్‌అహమ్మద్, నజీర్‌అహమ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.